క్లుప్తంగా

వీధి వ్యాపారాలు అభివృద్ధి చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీహరి

చీమకుర్తి: ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన లోక కల్యాణ మేళా పథకాన్ని సద్వినియోగం చేసుకొని వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మెప్మా పీడీ పీ.శ్రీహరి తెలిపారు. గురువారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పథకం ద్వారా బ్యాంకుల వారు మూడు విడతలుగా రూ.15 వేలు, రూ.25 వేలు, రూ.50 వేలు చొప్పున రుణాలు ఇస్తారన్నారు. వాటి ద్వారా తమ వ్యాపారాలను మెరుగుపరచుకొని జీవనోపాధిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, మెప్మా సిబ్బంది, మున్సిపల్ కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏపీ కంటే తమిళనాడులో పెట్రోల్ తక్కువ

ఒంగోలు వన్‌టౌన్: ఏపీ కంటే తమిళనాడులో పెట్రోల్, డీజిల్ రూ.8 తక్కువ ఉన్నాయని కేంద్ర మాజీ మంత్రి, మాజీ ఎంపి చింతా మోహన్ పేర్కొన్నారు. ఒంగోలుకు వచ్చిన ఆయన ఒంగోలు కేశవస్వామి పేటలోని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ దళితులు కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకూ దళితులు రోడ్లమీదకి వచ్చారన్నారు. కారంచేడు వెళ్లి చంద్రబాబు ఎప్పుడైనా మాదిగలను పరామర్శించారా అని విమర్శించారు. అనంతపురం సూపర్ సిక్స్ సభలో చంద్రబాబు సామాజిక న్యాయం గురించి మాట్లాడారని, సామాజిక న్యాయం కోరుకుంటే ఇప్పటికే 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశాడని, ఇక దిగిపోవాలన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. సమావేశంలో విజేంద్ర బహుజన్, పి మధుసూధనరావు, ఎం ప్రసన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఎస్‌బీఐ మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్ ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్

ఒంగోలు సబర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తోందని జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా రీజనల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులో టౌన్ ఖాతాదారులకు మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఎస్బీఐ గుంటూరు పరిపాలనా కార్యాలయ చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్ బన్సల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖాతాదారుల హక్కులు, బ్యాంక్ అందిస్తున్న సేవలు, సైబర్ మోసాల నుంచి ఎలా రక్షణ పొందాలి వంటి అంశాలపై వివరించారు. టౌన్ హాల్ మీటింగ్‌లో ఆర్.బి.ఓ చీఫ్ మేనేజర్లు కె.రవికుమార్, వేదం రాజేష్ బాబు, కె.హారతి, హెచ్.ఆర్.మేనేజర్ ఎ.ఎ న్.వి.ఎస్.నళినీకాంత్, కె.జానకిరామయ్య, అసోసియేషన్ నాయకులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

జనన, మరణాల రికార్డులు భద్రపరచాలి



జీజీహెచ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: జనన, మరణాల వివరాల నమోదు, రికార్డుల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ చీఫ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన జీజీహెచ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. మెడికల్ రికార్డుల విభాగంతోపాటుగా జనన, మరణ నమోదు కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలతలను కలిశారు. ఆయనతో పాటుగా జిల్లా గణాంక అధికారి పీవీ ప్రసాద్, మెడికల్ రికార్డ్ ఇన్‌చార్జి ప్రసాదరావు, ఎంఆర్‌డీ టెక్నీషియన్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కొత్తపట్నం: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఈతముక్కల, కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ఎంపీడీవో, వైద్యులు నవ్యారెడ్డి, శ్రావ్యలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యం కల్పించిందన్నారు. మహిళలకు ప్రాథమిక దశలోనే అన్ని వ్యాధులు గుర్తించడం, వారికి చికిత్స చేయడం వంటి సేవలు అందిస్తారన్నారు. వైద్యురాలు నవ్యారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ప్రసూతి మహిళలు, హిమోగ్లోబిన్, రక్తపోటు, క్యాన్సర్, క్షయ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి వైద్యం అందిస్తామని చెప్పారు. డాక్టర్ శ్రావ్య గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహారం ప్రాధాన్యం గురించి అంగన్‌వాడీ సిబ్బందికి వివరించారు.

ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులకు క్యాన్సర్, హ్యాండ్ వాష్, సీపీఆర్ గురించి నృత్య రూపకంతో తెలియజేశారు. జిల్లా టీబీ కార్యాలయం నుంచి ఎం. చంద్రమౌళి టీబీ గురించి వివరించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ బీ.హారిక, ఆయుష్ విభాగం నుంచి డాక్టర్ రామారావు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు..

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు పీహెచ్‌సీలో 250 మంది రోగులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని మొదట సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ పరిశీలించారు. పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఏ కరుణాకర్‌రావు, మెడికల్ ఆఫీసర్ బీ. సుధామణి, వైద్యులు నాగరాజు, శ్రీధర్ ఆధ్వర్యంలో చికిత్సలు అందించారు.



సంతనూతలపాడులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అభివృద్ధి లోకి వస్తుందని.. అలాంటి మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తెలగతోటి వెంకటేశ్వర్లు అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో లభించే పదార్థాలలోనే ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఏ విధంగా పొందాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యులు ఓనారియల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉన్నారు.

బండ్లమూడి పీహెచ్‌సీలో..

చీమకుర్తి రూరల్: బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ భగీరథ పాల్గొని మాట్లాడారు. శిబిరంలో 300 మందికి ఆరోగ్య పరీక్షలు చేశామని డాక్టర్ నవీన్, డాక్టర్ అఫ్సర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అవినాష్, ఎంఎల్ హెచ్పీలు, ఏఎన్ఎంలు, రోగులు పాల్గొన్నారు.



ఈతముక్కలలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న అధికారులు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



మద్దిపాడులో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు



బండ్లమూడిలో పాల్గొన్న జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ భగీరథ

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

చీమకుర్తి రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవి పాలెం గ్రామానికి రక్షిత మంచినీటి త్వరగా నీరందించడానికి గ్రామంలో పైప్‌లైన్‌లు త్వరగా పూర్తి చేయాలన్నారు. పలు గ్రామాలలో నాయకులు సూచనల మేరకు తాగునీటి బోరింగులు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని ఆదేశించారు. జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు వివరించారు. అధికారులు విధుల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

అలసత్వం వహించొద్దన్నారు. ఎంపీడీవో రాఘవేంద్ర, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఓ వీ శ్రీనివాసరావు వైస్ ఎంపీపీలు రావి లక్ష్మయ్య, జేష్ఠ శ్రీనివాసరావు, చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చీమకుర్తి సొసైటీ ప్రసిడెంట్ పూనాటి వెంకటరావు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మేరకే పొగాకు పండించాలి

ఒంగోలు సబర్బన్: పరిమితి మేరకే పొగాకును పండించాలని ఒంగోలు-2 వేలం కేంద్రం సూపరింటెండెంట్ జే.తులసి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె త్రోవగుంటలోని వేలం కేంద్రంలో గురువారం పొగాకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ పొగాకు పంటు ఉత్పత్తి నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనను రైతులు పెంచుకోవాలన్నారు. రైతులకు పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. 2025-26 పంట కాలం నుంచి మూడేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేస్తారన్నారు. అందుకుతగ్గట్టు బ్యారన్ లీజులు, పొలాల



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ తులసి

లీజులు అధిక ధరలకు తీసుకోరాదని కోరారు. కార్యక్రమంలో ఐటీసీ డెవలప్మెంట్ మేనేజర్ వెంకటేష్, జీపీఐ మేనేజర్ కిషోర్, పీఎస్ఎస్ మేనేజర్ ఆదిత్య, పొగాకు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగమే ధ్యేయం

మద్దిపాడు: దేశ ఆర్థిక స్వావలంబన కోసం స్వదేశీ వస్తువుల తయారీ వినియోగంలపై పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో వరసిద్ధి వినాయక స్వామి గుడి ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ ప్రకాశం జిల్లా సంఘ్ చాలక్ రావినూతల రాంప్రసాద్, గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ పారిశ్రామిక వాడ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ రత్నాకర్ ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక సంఘం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశం మొత్తంలో అన్ని ప్రాంతాలలో ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ విభాగ్ సంఘచాలక్ మండవ నాగేశ్వరరావు, ఒంగోలు విభాగ్ ప్రచారక్ నవీన్ కుమార్, ఒంగోలు విభాగ్ సంఘ చాలక్ రావినూతల రాంప్రసాద్, సాహస విభాగ సహ సంఘ చాలక్, పాబోలు ఈశ్వరయ్య, వివిధ కంపెనీల యజమానులు 100 మంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన సమాజం



పేర్నమిట్టలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణ



సంతనూతలపాడులో మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ భగీరథ

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): పౌష్టికారంతో మెరుగైన సమాజాన్ని సాధించవచ్చని ఐసీడీఎస్ పీడీ సువర్ణ పేర్కొన్నారు. గురువారం సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ-చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్ఎం శాంత కుమారి అధ్యక్షతన వహించారు. సుందరయ్య కాలనీ ఒకటో అంగన్వాడీ సెంటర్, రాజీవ్ నగర్ 2వ అంగనవాడీ సెంటర్లో జరుగుతున్న పోషకాహార మాసోత్సవాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు, వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆహార ప్రదార్థాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ నాగమణి, వైద్యుడు నాగరాజు, కరుణాకర్, మెడికల్ ఆఫీసర్ సుధామణి, సీహెచ్ఓ మాధవరావు, సూపర్‌వైజర్ సావిత్రి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు టీచ్చర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవాలి



మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధుకుమార్, కమిషనర్

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీ పరధిలోని అక్రమ లేఅవుట్లను అక్టోబర్ 24 లోపు క్రమబద్ధీకరింపజేసుకోవాలని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పీ.మధుకుమార్ తెలిపారు. గురువారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో లేఅవుట్ల యజమానులతో పాటు కమిషనర్ వై.రామకృష్ణయ్య, టీపీఓ శారద, స్థానిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మధుకుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జూన్ 30వ తేదీ లోపు కొనుగోలు చేసిన ప్లాట్లను ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా ఆన్‌లైన్ సిటిజన్ పోర్టల్ ద్వారా లేదా లైసెన్స్ పొందిన సర్వేయర్‌ల ద్వారా కొన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. చీమకుర్తి పట్టణ పరిధిలో మొత్తం 48 అక్రమ లేఅవుట్లు ఉండగా వాటిలో 21 లేఅవుట్లు క్రమబద్ధీకరించామని, ఇంకా 27 లే అవుట్లు ఉన్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ ఈ అవకాశం రాదని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చవితి గొడవల్లో మరో ఐదుగురి అరెస్టు ?

ఒంగోలు టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో నగరంలోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద తోపులాట జరిగింది. ఈ విషయంలో పోలీసులు శ్రీనగర్ కాలనీకి చెందిన 50 మంది గణేష్ భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో తొలుత ఏడుగురిని మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ కోర్టు అతడిని విడుదల చేసింది. శనివారం నారాయణ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. గురువారం హైదరాబాద్‌లో ఉన్న మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. వీరిలో దేవిరెడ్డి విక్రమ్ రెడ్డి, మడతల వాసురెడ్డి, చెంచిరెడ్డి, మల్లెల చైతన్య, పల్నాటి రవీంద్రారెడ్డి వున్నారు. వీరిని ఒంగోలు తీసుకొచ్చిన తాలుకా పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యువజన సమాఖ్య నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో పేరుకు పోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి కె.బాబు, సీఐటీయూ నగర నాయకులు తంబి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం నగర పాలక సంస్థ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ కాలనీలోకి వెళ్లే మార్గంలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ధరణి లక్ష్మణరావు రోడ్డుకు అడ్డంగా గదులు అద్దెకు ఇచ్చారని తెలిపారు. దాంతో కాలనీలో నిర్మాణంలో వున్న సీసీ రోడ్డు, మురుగు కాల్వల పనులు మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు. అధికారులు, పాలకులు చొరవ తీసుకొని రోడ్డుకు అడ్డంగా వున్న నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో యువజన నాయకులు కె.వంశీధర్, యు.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సరికొత్త టెక్నాలజీలపై విద్యార్థులకు వర్క్‌షాప్‌లు నిర్వహించారు. సీఎస్ఈ, ఏఐఎమ్ఎల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా యాప్‌ని ఎలా డెవలప్ చేయాలనే అంశంపై శిక్షణ అందించారు. ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్ ప్రియాన్షు శుక్లా దీనిపై ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సీఎస్ఈ రెండో ఏడాది విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ డెవలపర్, ట్రైనర్ సుందర్ పాత్రన్ ఇన్‌యాక్షన్-స్ట్రాటజీ అండ్ సింగిల్టన్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తూ ఉంటామని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలియజేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ ప్రవీణ, శివప్రసాద్, విజయలక్ష్మీ, డాక్టర్ రాయుడు తదితరులు పర్యవేక్షించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

ఇసుక తవ్వకాలు ఆపాలంటూ వినతి

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బంది కలిగించే అక్రమ ఇసుక తవ్వకాలు ఆపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి పత్రం అందించారు. సీపీఎం ఆధ్వర్యంలో మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన ఎస్టీ కుటుంబాల ప్రజలతో కలిసి నాగులుప్పలపాడు తహశీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జయంత్ బాబు మాట్లాడుతూ మండలంలోని చదలవాడ గ్రామ రెవిన్యూ పరిధిలో అక్రమార్కులు ఇసుక తవ్వకాలకు పూనుకుంటున్నారని, ఈ చర్యల వలన ఇనమనమెళ్లూరు ఎస్టీ కాలనీ ప్రజలు తీవ్రమైన హాని జరుగుతుందన్నారు. ఈ ఘటనపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తూబాటి శ్రీకాంత్, కాలనీవాసులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రేపు అంబేడ్కర్ నాటక ప్రదర్శన



కరపత్రం ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఒంగోలు టౌన్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సంఘం శరణం గచ్ఛామి సంస్థ ఈ నెల 20వ తేదీన అంబేడ్కర్ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రఘురాం తెలిపారు. నగర పరిధిలోని పేర్నమిట్ట శాంతినగర్‌లో గల నూకతోటి కోటయ్య కళా ప్రాంగణంలో ప్రదర్శించే నాటకాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం పేర్నమిట్టలోని అంబేడ్కర్ గ్రంథాలయంలో నాటకం కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కన్నబిడ్డ చావును కూడా వెలివాడల బతుకు భద్రత కోసం పరిత్యజించిన మేరునగధీరుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు బంకా సుబ్బారావు, తాళ్లూరు సుబ్బారావు, జూపూడి వీరనారాయణ, జార్జ్, అజయ్, సుమన్, యానిధి పాల్గొన్నారు.